సాక్షి

పార్వతీపురం మన్యం

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



'కంటి వెలుగు'కు మంగళం

గత ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. వృద్ధులకు ఆవేదన మిగిల్చింది. - 8లో



జర్నలిస్టుల సంక్షేమం పాలకుల బాధ్యత

జర్నలిస్టుల సంక్షేమం పాలకులు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. - 8లో



కుక్కల దాడిలో గొర్రెల మృతి

మామిడిపల్లి గ్రామం బక్కుపేటలో శనివారం తెల్లవారుజామున కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందాయి. - 8లో

న్యూస్‌రీల్

ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా

సాక్షి, పార్వతీపురం మన్యం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు మార్గదర్శకాలు విడుదల చేసింది. 2024 జూలై 31 నాటికి ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి బదిలీలు తప్పనిసరిగా పేర్కొంది. మొత్తం 15 శాఖల్లో బదిలీలకు ఆమోదం తెలిపింది. ఆగస్టు 19 నుంచి 31వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, గ్రామ వార్డు సచివాలయాలు, గనులు, పౌరసరఫరాలు శాఖల్లోని ఇంజినీరింగ్ ఉద్యోగులు, దేవదాయ, అటవీ, రవాణా, పరిశ్రమలు, విద్యుత్, వాణిజ్య పనులు, రిజిస్ట్రేషన్ల శాఖ లోని ఉద్యోగుల బదిలీలకు అనుమతిచ్చింది. ట్రెజరీ, కోపరేటివ్ తదితర విభాగాలకు ఈ సారి కూడా బదిలీలకు అవకాశం కల్పించలేదు. ఈ మేరకు జీఓ నంబర్ 75ను విడుదల చేసింది. పాత 13 జిల్లాల ప్రాతిపదికన బదిలీలు జరగనున్నాయి. జూలై 31 నాటికి ఒకే స్టేషన్ (గ్రామం, పట్టణం, నగరం)లో గరిష్ఠంగా ఐదేళ్ల సర్వీసు పూర్తయితే తప్పనిసరిగా బదిలీ జరగాల్సి ఉంటుంది. ఇదే సందర్భంలో జిల్లాల పునర్విభజన తరువాత అధిక శాతం మంది ఉద్యోగులు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. విజయనగరం నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీపై వెళ్లి అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు. బదిలీ ఉత్తర్వులు వస్తే తమ సొంత ప్రాంతాలకు రావచ్చనే ఆశతో ఎదురు చూస్తున్నారు. విశాఖ జిల్లా నుంచి సైతం చాలా మంది విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పనిచేస్తున్నారు. వీరంతా బదిలీల ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన తీసుకుంటే వీరి సర్వీసును ఏ విధంగా లెక్కలోకి తీసుకుంటారో అన్న ఆందోళన కొంతమందిలో వ్యక్తమవుతోంది. కొన్ని విభాగాలకు బదిలీల కు అవకాశం ఇవ్వకపోవడంతో తాము ఇంకా ఎంతకాలం మన్యం జిల్లాలో పనిచేయాలని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ సంఘాలకు మినహాయింపు

మిగతా అందరూ జీఓ సర్వీసుపై రిక్వెస్ట్ బదిలీకి అర్హులు. ఉద్యోగ సంఘాల నేతలకు బదిలీ ఒకే స్థానంలో తొమ్మిదేళ్ల వరకు మినహాయింపు ఉంటుంది. సెప్టెంబర్ 1 నుంచి మరలా బదిలీలపై నిషేధం ఉంటుంది. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న బదిలీల జీఓ రావడంతో ఉద్యోగుల్లో సందడి వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధుల చుట్టూ సిఫార్సుల లేఖల కోసం ప్రదక్షిణ చేస్తున్నారు. తాము కోరుకున్న స్థానానికి వెళ్లిపోవడానికి ఎవరికి వారు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అవసరమైనంత ముట్టజెప్పేందుకు కూడా వెనుకాడడం లేదు. ఇదే సందర్భంలో కొంతమంది చోటా నేతలు తమ పలుకుబడి ఉపయోగించి పనిచేసి పెడతామంటూ ప్రగల్భాలు పలుకుతూ కొంత మొత్తాలు వసూళ్లకు సిద్ధపడుతున్నట్టు వినికిడి. ఉపాధ్యాయులు, వైద్యారోగ్య సిబ్బందిని బదిలీలకు ప్రభుత్వం దూరంగా ఉంచింది.

కౌలు రైతుకు కష్టాలు



వ్యవసాయ పనిలో నిమగ్నమైన కౌలు రైతులు

- పంట సాగుపత్రాలు అందజేతలో జాప్యం
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు కావస్తున్నా చొరవ చూపని ప్రభుత్వం
- రైతులకు రాయితీలు కల్పించాల్సి వస్తుందన్న నెపంతో వెనుకంజ
- నూతన కౌలు చట్టం అధ్యయనం పేరిట కాలయాపన
- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో లక్ష్యానికి మించి కౌలు రైతులకు మేలు

సాక్షి, పార్వతీపురం మన్యం: రైతన్నకు గడ్డుకాలం ఎదురైంది. ఓ వైపు వర్షాలు అనుకూలించడం లేదు. మరోవైపు ప్రభుత్వం నుంచి సాయం అందని ద్రాక్షగా మారింది. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20వేలు చొప్పున అందజేస్తామన్న కూటమి ప్రభుత్వ పాలకులు ఇప్పుడు కానరావడం లేదు. రైతు ఆవేదనను పట్టించుకోవడం లేదు. సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తే ప్రభుత్వం ఉలిక్కిపడుతోంది. ప్రభుత్వ అలసత్వం వ్యవసాయ ఆధారితమైన పార్వతీపురం మన్యం జిల్లా రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. కౌలు రైతులకు ఎక్కువ కష్టాలు తెచ్చిపెడుతోంది.

గతంలో ఇలా..

పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని 15 మండలాల్లో ఏటా సాధారణ సాగువిస్తీర్ణం 3,28,961 ఎకరాలు. ఇందులో వరి పంట సాగయ్యేది 70వేల హెక్టార్లలో. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సమయంలో సీజన్ వారీగా రైతులకు పెట్టుబడి సాయంతో పాటు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు, తదితర సేవలు రైతులకు ఠంచన్‌గా అందేవి. 306 రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందుగానే 30,766 టన్నుల విత్తనాలు, 42,523 మెట్రిక్ టన్నుల ఎరువులను అందించేవారు. నాలుగు నియోజక వర్గాల్లోని 280 కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా రూ.9.3 కోట్ల విలువైన రాయితీ వ్యవసాయ యంత్రాలను గ్రామస్థాయిలో రైతు సంఘాలకు అందజేశారు. పెట్టుబడి నిధులు 'రైతు భరోసా' పేరిట ఏటా సుమారుగా 1,39,505 మంది రైతుల ఖాతాలకు రూ.188.048 కోట్ల మేర డీబీటీ విధానంలో జమ చేసినట్టు లెక్కలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే కౌలు రైతులకు సీసీఆర్‌సీ పత్రాలు పంపిణీ చేసేది. వీటి ఆధారంగా బ్యాంకు రుణాలు, వ్యవసాయ రాయితీలు అందేవి.

ఇప్పుడు ఇదీ పరిస్థితి..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ముఖ్యంగా ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులను చిన్నచూపు చూస్తోంది. ఈ ఏడాది రైతుకు పెట్టుబడి సాయం అందజేసే మాటకు అతీగతి లేదు. కౌలురైతుల మాటే మరిచింది. వారికి సీజన్‌కు ముందుగా అందించాల్సిన సీసీఆర్‌సీ (కౌలు రైతు గుర్తింపు కార్డు) పత్రాలు ఇప్పటికీ అందించ లేకపోయింది. దీంతో బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు కావడం లేదు. వ్యవసాయ రాయితీలు అందడం లేదు. వడ్డీలకు అప్పులు వాడాల్సిన పరిస్థితి.

రాయితీలు అందించాల్సి వస్తుందనే..

జిల్లాలో ఈ ఏడాది 11,660 పై చిలుకు కౌలు రైతులకు కార్డులను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టిన వ్యవసాయ, రెవెన్యూ శాఖలు ఇప్పటి వరకు 9,103వేల మంది కౌలు రైతుల వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వీరికి కార్డులు అందించడంలో సఫలం కాలేదు. దీంతో విత్తనాలు, ఎరువులన్నీ బహిరంగ మార్కెట్లోనే అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో అర్హులు ఎంతమంది ఉన్నా సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉండేది. గతంలో 16,972 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీ చేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ లక్ష్యంలో 5,312కు కోతపెట్టినా పూర్తిగా కార్డులు అందించలేకపోయిందని రైతులు వాపోతున్నారు. సకాలంలో సీసీఆర్‌సీలు మంజూరు చేస్తే అన్నదాత సుఖీభవ, రాయితీపై విత్తనం, ఎరువులు, ఇతర ఉపకరణాలు అందించాల్సి వస్తోందనే బెంగతో విధివిధానాల పేరుతో జాప్యం చేస్తున్నట్టు కౌలు రైతులు విమర్శిస్తున్నారు. వాస్తవంగా కౌలు పత్రం జూన్‌లో ఇస్తేనే రైతులకు ప్రయోజనముంటుంది. రాయితీ విత్తనం, ఎరువులు, రుణాలు పొందవచ్చు. ఆగస్టు మూడో వారం వచ్చినా కౌలు కార్డులు శతశాతం ఇవ్వకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.


జిల్లా : పార్వతీపురం మన్యం
మండలం :
VEERAGHATTAM
Kattulakavitti (భూ యజమాని) మరియు శ్రీ VUDAYANA SATHYANARAYANA S/o Chinnamnaidu (సాగుదారు)
181,KATHULAKAVITI,VEERAGHATTAM,SRIKAKULAM
(20/06/2023) ... (20/05/2024) వరకు 11 నెలలు కాలపరిమితితో కుదిరిన ఒప్పంద పత్రం.
సాగుదారు ఆధార్ నెంబర్ : 736402814604
మొబైల్ నెంబర్ : 8008333290
లింగం : Male
కులం : BC

గత ప్రభుత్వం సీజన్‌కు ముందే అందించిన సీసీఆర్‌సీ కార్డు (ఫైల్)

ఇబ్బంది పడుతున్నాం..



గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా కౌలు గుర్తింపు కార్డులపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించేవారు. సచివాలయ సిబ్బంది రైతుల వివరాలు సేకరించి కార్డులు అందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కౌలుకు భూమి చేస్తున్నా ఇంతవరకు కార్డు అందలేదు. ఎలాంటి పెట్టుబడి సాయమూ ప్రభుత్వం చేయలేదు. అప్పుచేసి మదుపు పెడుతున్నాను. గతంలో సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం నేరుగా బ్యాంకు ఖాతాకు జమయ్యేది. ఇప్పుడు అప్పు శరణ్యంగా మారింది.

– నల్లి రాము, కౌలు రైతు, గరుగుబిల్లి గ్రామం

కంప్యూటరీకరణతో విప్లవాత్మక మార్పులు



బ్యాంకు సిబ్బందితో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్‌లు) కంప్యూటరీకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. తన చాంబర్‌లో సహకార శాఖ అధికారులు, డీసీసీబీ బ్యాంకు మేనేజర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ సహకార సంఘాల సభ్యుల వివరాల కంప్యూటరీకరణ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులు సహకార రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని తెలిపారు. శతశాతం కంప్యూటరీకరణ పనులు మూడు రోజులలో పూర్తి కావాలన్నారు. డేటా సేకరణలో తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు సహకారం తీసుకోవాలని, సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. కంప్యూటరీకరణ ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతలను మండల ప్రత్యేక అధికారులకు అప్పగించాలని జిల్లా నోడల్ అధికారి, సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోబికను ఆదేశించారు. ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్‌కు అనుగుణంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల స్వావలంబనకు భారత ప్రభుత్వం కంప్యూటరీకరణ ప్రక్రియను చేపట్టిందన్నారు. కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుకు సదరు డేటాను జాతీయ స్థాయిలో అనుసంధానం జరుగుతుందని, తద్వారా పీఏసీఎస్ కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచడం, రుణాలను వేగంగా పంపిణీ చేయడం, లావాదేవీల వ్యయాన్ని తగ్గించడం, చెల్లింపులలో అసమతుల్యతను తగ్గించడం జరుగుతుందన్నారు. జిల్లా కోపరేటివ్ అధికారి పి.శ్రీరామ్మూర్తి, డీసీసీబీ బ్యాంకు మేనేజర్లు హాజరయ్యారు.

సంపూర్ణ పోషణ అభియాన్ విజయవంతం చేయాలి

జిల్లాలో సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శనివారం జరిగిన కార్యక్రమంలో సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించి సంపూర్ణ పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేపట్టాలని, అందులో ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కలిగించాలన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు పౌష్టికాహార నిర్వహణపై వారం రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని మహిళా, శిశు సంక్షేమ శాఖను ఆదేశించారు. డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, డీఈఓ జి.పగడాలమ్మ, జిల్లా పశుసంవర్థక అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.రుక్మాంగదయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివ ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డా.టి.జగన్‌మోహన్‌రావు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ బి.హరిబాబు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, ఆర్ అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారి ఎం.జేమ్స్, జంఝావతి కార్యనిర్వాహక ఇంజినీర్ జగదీష్, ఇన్‌చార్జి జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొత్సకు అభినందనలు



ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణకు శనివారం పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ తదితరులు బొత్సకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

– సాక్షి ప్రతినిధి, విజయనగరం

వైద్యుల నిరసన గళం

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్యవిద్యార్థినిపై జరిగిన అమానుష దాడిని వైద్య వర్గాలు ఖండించాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐఎంఏ పిలుపు మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో వైద్యులు, సిబ్బంది శనివారం నిరసన ప్రదర్శనలు చేశారు. ఓపీ సేవలను నిలిపివేశారు. వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు చేశారు. పార్వతీపురం పట్టణంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో వైద్యులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– పార్వతీపురం టౌన్



నిధుల మంజూరులో జాప్యం

విద్యార్థులకు శాపం

- మోడల్ స్కూళ్లలో మరుగుదొడ్ల నిర్వహణ అంతంతమాత్రమే..
- కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల ఫలితం
- తల్లికి వందనం డబ్బులు వచ్చేవరకూ స్వీపర్లు, హెల్పర్లకు వేతనం కట్



పేదకుటుంబాల విద్యార్థులు చదువుకునే సర్కారు బడిపై కూటమి ప్రభుత్వం శీతకన్నువేసింది. పాఠశాల నిర్వహణ నిధుల మంజూరులో జాప్యం విద్యార్థులకు శాపంగా మారింది. నాడు పరిశుభ్రంగా.. పిల్లల భవిష్యత్తుకు 'ఆదర్శం'గా నిలిచే విద్యాలయాలు నేడు సమస్యల లోగిళ్లుగా మారాయి. మధ్యాహ్న భోజనం నుంచి మరుగుదొడ్ల వరకు ప్రతీది సమస్యగానే కనిపిస్తోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆవేదన, ఆందోళనకు గురి చేస్తోంది.

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ' నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. ఇంట్లో ఒకరుంటే రూ.15 వేలు.. ఇద్దరుంటే రూ.30 వేలు..ముగ్గురుంటే రూ.45 వేలు.. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తాం.. అమ్మ ఒడికి మించి తల్లికి వందనం స్కీమ్ అమలు చేస్తాం.. అంటూ గత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు, లోకేశ్ సహా టీడీపీ నాయకులు జనాల చెవుల్లో ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా అమలుచేసిన అమ్మ ఒడి పథకం కొనసాగించలేదు. తల్లికి వందనం స్కీమ్ ఈ ఏడాదికి లేనట్లేనని, వచ్చే సంవత్సరం అమలుచేయడానికి రోడ్ మ్యాప్ రూపొందిస్తామని రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ నాలుక తిరగేశారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ పడకేసింది. విషజ్వరాల విజృంభించే సీజన్‌లో విద్యార్థులను భయంకర పరిస్థితుల్లోకి నెట్టేశారు. ఆవేదనకు గురిచేస్తున్నారు.

'అమ్మ ఒడి' ఎంతో ఉపయోగం...


పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం ఏటా ఇచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'అమ్మ ఒడి' పథకాన్ని తీసుకొచ్చింది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరిగింది కానీ పారిశుద్ధ్య నిర్వహణ సమస్య వారికొక గుదిబండగా ఉండేది. దీని పరిష్కారం కోసం అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచించి... పాఠశాలల్లో ప్రత్యేకంగా పారిశుద్ధ్య నిర్వహణ కోసం జిల్లాస్థాయిలోనే ఒక నిధిని ఏర్పాటు చేశారు. అమ్మఒడి పథకం కింద ప్రతి విద్యార్థి తల్లి ఖాతాకు జమయ్యే సొమ్ములో రూ.2 వేలు మినహాయించి ఆ నిధికి మళ్లించేవారు. ప్రతి పాఠశాలల్లో మరుగుదొడ్లను నిర్మించి, వాటి నిర్వహణకు ఒక స్వీపరు, ఒక హెల్పర్‌ను నియమించారు. వారికి ప్రతినెలా పారిశుద్ధ్య నిధి నుంచి వేతనాలు చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మఒడి పథకం నిలిపేశారు. తల్లికి వందనం హామీ గాలిలో పెట్టారు. దీంతో స్వీపర్లకు, హెల్పర్లకు రెండు నెలల నుంచి వేతనాలు రాలేదు.

'ఫొటో' బాధ్యత మారింది

ప్రతి పాఠశాలలో రోజూ స్వీపరు, హెల్పర్ వచ్చి మరుగుదొడ్డి శుభ్రం చేయాలి. వారు ఏ విధంగా శుభ్రం చేసినదీ పరిశీలించి ఆ పాఠశాలలో టీచర్లు ఫొటోతీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇదీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ విధానం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫొటో తీసే పని టీచర్లకు గాకుండా సమీప గ్రామ/వార్డు సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అప్పగిస్తున్నారు. అదీ వారంలో రెండు రోజులు వెళ్లి పరిశీలించి ఫొటో అప్‌లోడ్ చేస్తే చాలు. ఈ మార్పు ఫలితంగా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేశారు.


ఏ స్కూల్ చూసినా...

విజయనగరం జిల్లాలో 13, పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ప్రతి స్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకూ ఒక్కో సెక్షన్‌లో వంద మంది చొప్పున 500 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ఒక్కో గ్రూప్‌లో 40 మంది వరకూ ఉన్నారు. ఆయా స్కూళ్లను శనివారం 'సాక్షి' బృందం పరిశీలించింది. పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి.



వంట గదిగా ఉపయోగిస్తున్న ఉన్నత పాఠశాలకు చెందిన భవనం

కురుపాం మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ వంటకు శాశ్వత భవనం లేదు. దీంతో తరగతి గదినే వంటకు వాడుతున్నారు. విద్యార్థులకు వరండాలోనే భోజనాలు వడ్డిస్తున్నారు.



పొగపొయ్యిలపై వంటలు

భామిని మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో వంట గది లేదు. రేకుల షెడ్‌లో వంట చేస్తున్నారు. భోజనాల గది లేకపోవడంతో వరండాలోనే విద్యార్థులు భోజనాలు చేయాల్సిన పరిస్థితి.

సాలూరు మండలంలోని పురోహితునివలస మోడల్ స్కూల్‌లో సరైన డైనింగ్ హాల్ లేకపోవడంతో వరండాల్లోనే విద్యార్థులు భోజనం చేస్తున్నారు. పాఠశాల మార్గం సరిగా లేదు. తాగునీటి సమస్య తీరట్లేదు.

గల్లంతైన మృతదేహం లభ్యం



మాతుమూరు సమీపంలో లభ్యమైన వార్డెన్ మహేష్ మృతదేహం

పాచిపెంట: సరాయివలస సమీపంలో రాయిమాను వాగులో శుక్రవారం కొట్టుకుపోయిన మండలంలోని కొటికిపెంట ఏకలవ్య మోడల్ పాఠశాల వార్డెన్ మహేష్ మృతదేహం శనివారం లభ్యమైంది. ఏపీఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది చేపట్టిన గాలింపు చర్యల్లో మాతుమూరు సమీపంలో మహేష్ మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహాన్ని సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు శనివారం పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను సర్పంచ్ చింత సీతయ్య, ఇతర నాయకులు వివరించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ ఈ వాగుపై వంతెన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు గతంలో తాము పంపించామని చెప్పారు. ఈ పెద్ద నిర్మాణం పీఆర్ శాఖ ద్వారా చేయాల్సి ఉందని, ఐటీడీఏ ద్వారా చేయలేమని నాడు అధికారులు చెప్పడంతో వంతెన నిర్మాణానికి అడుగులు ముందుకు పడలేదన్నారు. ఈ ప్రతిపాదనలు నేటికీ ప్రభుత్వం వద్ద ఉన్నాయని, కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆ పాపం టీడీపీదే..!

- 2013లో మంజూరైన ఏకలవ్యపాఠశాల పనులు
- 2014–19 మధ్య పాఠశాలకు వసతి సదుపాయాన్ని పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం
- ఉపాధ్యాయుల మృతి పాపం టీడీపీదే నంటున్న స్థానికులు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 75 శాతానికి పైగా నిర్మాణం పూర్తయిన కొటికిపెంట ఏకలవ్య మోడల్ స్కూల్ భవన నిర్మాణం

పాచిపెంట: మండలంలోని సరాయివలస సమీపంలో రాయిమానువాగు దాటుతూ నీటి ఉధృతికి ఇద్దరు ఉపాధ్యాయులు కొట్టుకుపోయి శుక్రవారం మృతిచెందిన విషయం తెలిసిందే. హర్యానా రాష్ట్రానికి చెందిన వీరు స్థానిక కొటికిపెంట ఏకలవ్యపాఠశాల ఉపాధ్యాయులు. ఏకలవ్య పాఠశాల భవనాలు పూర్తికాకపోవడంతో సరాయివలస గిరిజన ఆశ్రమ పాఠశాల అదనపు భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణాలు సకాలంలో పూర్తయి ఉంటే.. ఉపాధ్యాయులకు వాగు దాటే అవసరం ఉండేదికాదని, ఆ పాపం టీడీపీదేనంటూ స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవంగా 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొటికిపెంటలో ఏకలవ్య మోడల్ పాఠశాలను అప్పటి ఎంపీ వైరిచర్ల కిశోర్‌చంద్రదేవ్ మంజూరుచేయించారు. సమైక్యాంధ్ర ఉద్యమంతో పనులు ముందుకు సాగలేదు. 2014 నుంచి 2019వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం భవన నిర్మాణం గురించి కనీసం పట్టించుకోలేదు. నాడు ఎమ్మెల్సీగా నేటి స్త్రీ శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఉన్నారు. ఆమె సైతం కనీసం భవనానికి శంకుస్థాపన చేయలేదు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యను పట్టించుకోలేదు. భవనాలు లేకపోవడంతో ఏకలవ్య మోడల్ స్కూల్‌ను సరాయివలస గిరిజన ఆశ్రమ పాఠశాల అదనపు భవనాల్లో కొనసాగించారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో 2020లో అప్పటి ఎంపీ గొడ్డేటి మాధవితో కలిసి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు 75 శాతం పూర్తయ్యాయి. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కనీసం 10 శాతం పనులు పూర్తిచేసినా.. తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తయ్యేవని స్థానికులు చెబుతున్నారు. అదే జరిగితే నేడు ఉపాధ్యాయులు ఈ వాగు దాటాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. టీడీపీ ప్రభుత్వం పాపం ఈ రోజు వృత్తిరీత్యా రాష్ట్రాలు దాటివచ్చిన ఉపాధ్యాయుల ప్రాణాలకు శాపంగా మారిందని స్థానికులు అంటున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దెబ్బతిన్న ఇల్లు

• రూ.6లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో కాలిబూడిదైన సామగ్రి

జామి: మండలంలోని జాగరం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శ్లాబ్ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు. జాగరం గ్రామానికి చెందిన జాగరపు ఈశ్వరరావు ఇంట్లో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు చేరి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఎస్.కోట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి అదుపు చేశారు. అయితే అప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రెండు ల్యాప్‌టాప్‌లు, రూ.80వేల నగదు, ఫర్నిచర్ మొత్తం కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.ఆరు లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

కారును లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

• ముగ్గురికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాయుడు

కొత్తవలస : అరుకు – విశాఖ జాతీయ రహదారిలో మంగళపాలెం జంక్షన్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి వేగంగా వచ్చిన లారీ కారును ఢీకొట్టడంతో కొత్తవలస గ్రామానికి చెందిన మేలాస్త్రీ నాయుడు(23) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి సంబంధించి కొత్తవలస సీఐ షణ్ముఖరావు అందించిన వివరాలు ఇలా వున్నాయి. మృతుడు నాయుడుతో పాటు కొత్తవలస గ్రామానికి చెందిన మరో ముగ్గురు యువకులు బూసాల షణ్ముఖ, గొరపల్లి లోకేష్, పెంటకోటి షణ్ముఖ తన స్నేహితుడు చెల్లికి పెళ్లి సందర్భంగా పని నిమిత్తం కొత్తవలస నుంచి కారులో పెందుర్తి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో పెందుర్తి నుంచి కొత్తవలస వైపు అతి వేగంగా వచ్చిన లారీ మంగళపాలెం జంక్షన్ వద్ద బలంగా ఢీకొట్టింది. దీంతో కార్లో ప్రయాణిస్తున్న నాయుడు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108 వాహనంలో విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడబిల్లి – గొట్లాం రైల్వే స్టేషన్ల మధ్య అప్ లైనుపై గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు విజయనగరం రైల్వే ఎస్ఐ బాలాజీరావు శనివారం తెలిపారు. వేకువ జామున పట్టాలు పక్కన సుమారు 34 సంవత్సరాల వయస్సు ఉండి గ్రీన్ కలర్ ప్యాంటు, రెడ్, బ్లాక్, వైట్ చారలు గల టీ షర్టును ధరించిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లుగా గుర్తించామన్నారు. మృతుని వద్ద రాయగడ నుంచి చత్రపూర్ వెళ్లే రైల్వే టిక్కెట్టు మినహా ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినంత వరకు మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని మహరాజ ఆస్పత్రిలో భద్రపరచనున్నట్టు చెప్పారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని సూచించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

డెంకాడ: మండలంలోని బంగార్రాజుపేట గ్రామంలో ఒక స్థల వివాదంలో రెండు వర్గాలు కొట్లాటకు దిగడంతో వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. బంగార్రాజుపేట గ్రామంలో ఇంటికి ఆనుకుని ఉన్న స్థలం వివాదం నేపథ్యంలో జరిగిన కొట్లాటపై గ్రామానికి చెందిన నందిక బంగార్రాజు, కాగితాల సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹113	₹196	₹206

'కంటి వెలుగు'కు మంగళం

• అవ్వాతాతలకు నిలిచిన కంటి పరీక్షలు
• వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 1,79,890 మంది అవ్వాతాతలకు ప్రయోజనం
• 28,213 మందికి శస్త్రచికిత్సలు
• 43,938 మంది అవ్వాతాతలకు కంటి అద్దాల పంపిణీ



విజయనగరం ఫోర్ట్: వృద్ధుల్లో కంటి సమస్యలను పరిష్కరించి చూపును ప్రసాదించాలనే గొప్ప సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టింది. మొదటి, రెండు విడతల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. కంటి అద్దాలు అందించారు. మూడో విడతలో అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంలో మంగళం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిలిపివేసింది. గత ప్రభుత్వ హయాంలో కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి వైద్యులు, అఫ్తాల్మిక్ అధికారులు గ్రామాలకు వెళ్లి అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించేవారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి శస్త్రచికిత్సలు చేయించేవారు. కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచితంగా అందజేసారు. ప్రస్తుతం అవ్వాతాతలకు గ్రామాల్లో కంటి పరీక్షలు నిలిచిపోయాయి. ఏదైనా సమస్య ఉంటే అవ్వాతాతలు కంటి ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రభుత్వ కంటి ఆస్పత్రికి వెళ్లిన వారికి ఉచితంగా సేవలు అందుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన వారు డబ్బులు వెచ్చించి వైద్య సేవలు పొందుతున్నారు.

తొలి విడతలో 2,92,462 మంది విద్యార్థులకు పరీక్షలు

డా.వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో 2019 అక్టోబర్ 10 నుంచి 16 వరకు జిల్లాలో 3357 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు పరీక్షలు చేశారు. 3,03,717 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయాల్సి ఉండగా 2,92,462 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 2,79,471 మందికి సాధారణ కంటి చూపు ఉంది. 13,109 మందికి కంటి సమస్యలు ఉన్నట్టు గుర్తించి కంటి వెలుగు రెండో దశకు కంటి పరీక్షలు నిమిత్తం సిఫార్సు చేసారు.

రెండో విడత

రెండో విడత 2019 నవంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు రెండు నెలలు పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. 13,109 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 8901 మందికి సాధారణ కంటి చూపు ఉంది. ఇందులో 3844 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి అందజేశారు. మెల్ల కన్ను శస్త్రచికిత్సలు 18 మందికి, కంటి శుక్లం శస్త్రచికిత్సలు ఐదుగురికి, రెప్పవాలటం శస్త్రచికిత్సలు 20 మందికి నిర్వహించారు.

మూడో విడతలో అవ్వాతాతలకు

మూడో విడత కంటి వెలుగు కార్యక్రమం 2020 ఫిబ్రవరి 18 నుంచి అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేయడం ప్రారంభించారు. అయితే కోవిడ్ కారణంగా కొంత కాలం కంటి పరీక్షలు చేయడం నిలిపివేసారు. 2021 మే 27 నుంచి మళ్లీ కంటి పరీక్షలు పునః ప్రారంభించారు. 2024 మే మొదటి వారంలో అవ్వాతాతలకు కంటి వెలుగు కార్యక్రమాన్ని నిలిపివేసారు. మూడో విడతలో 1,79,890 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 28,213 మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. 43,938 మంది అవ్వతాతలకు కళ్ల జోళ్లు అందించారు.

నిలిచిన 'కంటి వెలుగు'

కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అవ్వాతాతలకు కంటి పరీక్షలు ప్రస్తుతం జరగడం లేదు. విద్యార్థులకు పాఠశాలల్లో వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేసే కార్యక్రమం ప్రస్తుతం జరుగుతుంది.

–డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్ఓ

జర్నలిస్టుల సంక్షేమం పాలకుల బాధ్యత

• జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: జర్నలిస్టుల సంక్షేమం పాలకులు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఐఎంఏ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని జర్నలిస్టులు ఘనంగా నిర్వహించారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, సంధ్యారాణి, ఉమ్మడి విజయనగరం జిల్లాకి చెందిన ఎమ్మెల్యేలతో పాటు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలిత అంబటి సత్రం కూడలిలో ఉన్న సంఘం వ్యవస్థాపకుడు సీవైచింతామణి విగ్రహానికి మంత్రి సంధ్యారాణి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారధులు లాంటి వారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం బాగుంటే ప్రభుత్వ పాలను ఉత్తమంగా ఉంటుందని, ఆ దిశగా గత ప్రభుత్వం పాటించిందన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదన్నారు. సీనియర్ ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉందనీ విలువలు పాటించిన జర్నలిస్టులను ఈ సందర్భంగా కొనియాడారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌వీప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అదితి గజపతి రాజు, లోకం మాధవి, తోయక జగదీశ్వరి, సమాచార శాఖ జిల్లా ఏడీ డి.రమేష్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీనాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీనివాస్, సంఘం రాష్ట్ర ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఘనంగా వారిని సంఘం సత్కరించింది. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌రాజు, మహా పాత్రో, పంచాది అప్పారావు, రాధాకృష్ణ, వైఎస్ పంతులు, డేవిడ్ రాజు, లింగాల నరసింరావు, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు, జిల్లాలో వివిధ మండలాల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న పత్రికల సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వంద రోజుల విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయండి : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో వంద రోజుల విజన్ డాక్యుమెంట్‌ను అన్ని శాఖలు తక్షణం తయారు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047పై దృష్టి సారించిందని కలెక్టర్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో ప్రాథమిక రంగాల శాఖల అధికారులతో కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు స్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చేలా శాఖల విజన్ ఉండాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సామాన్యుడికి ఫలాలు అందాలని, జిల్లా స్థాయి నుంచి కుటుంబ స్థాయి వరకు ఒక యూనిట్‌గా ప్రణాళికలు రచించాలని ఆయన సూచించారు. అప్పుడే విజన్ డాక్యుమెంట్‌కు సార్థకత చేకూరుతుందన్నారు. విజన్ వంద రోజుల డాక్యుమెంట్ రూపకల్పనకు అన్ని శాఖల అధికారులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. ప్రతి అంశానికి సంబంధించి విలువ ఆధారిత జోడించి కార్యాచరణ చేయాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, పరిస్థితులు, అభివృద్ధికి గల అవకాశాలను పేర్కొంటూ వంద రోజుల డాక్యుమెంట్ రూపకల్పన జరగాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆరోగ్యం, సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, స్థిరమైన అభివృద్ధి వివరాలను పొందుపరచాలని ఆయన ఆదేశించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ఈ డాక్యుమెంట్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. 2024 సంవత్సరం నుండి 2029 సంవత్సరం వరకు శాఖల వారి అభివృద్ధికి ప్రణాళికలు ఆవస్యమన్నారు. ప్రతి ఏడాది కనీసం 15 శాతం వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా ఉండాలని ఆయన తెలిపారు. ప్రణాళికల రూపకల్పనలో ఆర్థిక, భౌతిక లక్ష్యాలు స్పష్టంగా పేర్కొనాలని ఆయన ఆదేశించారు. గ్రామస్థాయి ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. ప్రాథమిక రంగాలు, తయారీ రంగాలు, సేవా రంగాల వారీగా స్పష్టమైన అవగాహన ఉండాలని ఆయన సూచించారు. జిల్లా తలసరి ఆదాయం, స్థూల ఆదాయం గణనీయంగా వృద్ధి సాధించేందుకు డాక్యుమెంట్ ఉపయోగపడాలన్నారు. ఈ నెల 26వ తేదీ నాటికి ముసాయిదా నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు మాట్లాడుతూ విలువ ఆధారిత ఉండే విధంగా ప్రతి అంశానికి రూపకల్పన జరగాలన్నారు. ప్రభుత్వం సూచించిన సమయానుగుణంగా ప్రణాళికలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి



సాలూరు రూరల్: మామిడిపల్లి గ్రామం బక్కుపేటలో శనివారం తెల్లవారుజామున కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల యజమాని గడదేశి శంకరరావు చెప్పిన వివరాలు.. శనివారం తెల్లవారుజామున ఎవరూ లేని సమయంలో గ్రామంలో కుక్కల మంద తన గొర్రెలపై దాడి చేసి ప్రాణాలు తీసాయని తెలిపారు. తన కుటుంబానికి ఆధారమైన గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేసారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

12 గొర్రె పిల్లల మృతి

వంగర: మండల పరిధి రుషింగి గ్రామంలో కురమాన అప్పలనాయుడుకు చెందిన గొర్రెల మందపై కుక్కలు శనివారం దాడి చేశాయి. ఈ దాడిలో 12 గొర్రెపిల్లలు మృతి చెందాయి. దీంతో బాధితుడు లబోదిబోమంటూ రోదిస్తున్నాడు. గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్న బాధితుడిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గిరిజన గ్రామాల్లో విజి'లెన్స్'

• విద్యుత్ బకాయిలు, అక్రమ కనెక్షన్ల గుర్తింపు
• విద్యుత్ సరఫరా నిలిపేసి, మీటర్ల స్వాధీనం

బొబ్బిలి రూరల్: మండలంలోని గిరిజన గ్రామాలైన కాశిందొరవలస, ఎరకందొరవలస, చిలకమ్మవలస తదితర గిరిజన గ్రామాల్లో ఉన్న తాగునీటి, సాగునీటి వనరులకు ఉన్న విద్యుత్ కనెక్షన్లను విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు తొలగించారు. విద్యుత్ శాఖ విజెలెన్స్ అధికారులు ఆయా గిరిజన గ్రామాల్లో శనివారం ఆకస్మికంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాటర్ ట్యాంకుల విద్యుత్ బిల్లులు రూ.లక్షల్లో ఉండగా అవి చెల్లించని కారణంగా గ్రామాల్లోని వాటర్ ట్యాంకులకున్న విద్యుత్ కనెక్షన్లను తొలగించారు. మీటర్లను పట్టుకుపోయారు. ఆయా గ్రామాల్లో ఒకే గుర్తింపు కార్డుతో పలు కనెక్షన్లను పొంది విద్యుత్‌ను వినియోగిస్తున్న వారిని గుర్తించిన విజిలెన్స్, విద్యుత్ కనెక్షన్లను తొలగించి మీటర్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ప్రస్తుతం ఆయా గిరిజన గ్రామాల ప్రజలకు తాగునీరు, సాగునీరు నిలిచిపోయాయి. రూ.లక్షల్లో విద్యుత్ బకాయిలున్నాయని, పంచాయితీ కార్యదర్శికి నోటీసులిచ్చినా వారు బకాయి బిల్లులు చెల్లించడం లేదని దీంతో విద్యుత్ సరఫరాను కట్ చేశామని, మీటర్లను స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ అధికారులు చెబుతున్నారు. దీనిపై ఎంపీడీఓ పి.రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం 5 గిరిజన గ్రామాల్లో విజిలెన్స్ రైడ్ జరిగినట్లు తెలిసిందన్నారు. ఒకే గుర్తింపుతో ఎక్కువ మోటార్ కనెక్షన్లను పొందిన వారితో పాటు వాటర్ ట్యాంకులకు అందిస్తున్న విద్యుత్ సరఫరా బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సైతం విద్యుత్ శాఖ అధికారులతో చర్చలు జరిపారన్నారు. ప్రస్తుతానికి జరిమానాగా విధించిన రూ.7వేలను సర్దుబాటు చేస్తామని, కొద్దిరోజుల సమయం ఇస్తే బకాయిలు చెల్లిస్తామని విద్యుత్ శాఖ ఏడీఈకి వివరించినా విజిలెన్స్ విభాగం రైడ్ చేసిన దానికి తామేమి చేయలేమని చెబుతున్నారని ఎంపీడీఓ తెలిపారు. తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాటర్ ట్యాంకుకు నీటి సరఫరాకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కోరామని ఎంపీడీఓ తెలిపారు.

మృతదేహాల తరలింపునకు..

మానవత్వంతో స్పందించండి

• మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మృతదేహాలను పరిశీలిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సాలూరు: వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన ఉపాధ్యాయుల మృతదేహాల తరలింపు విషయంలో ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కోరారు. పాచిపెంట మండలం సరాయివలస సమీపంలో రాయిమాను వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన హర్యానా రాష్ట్రానికి చెందిన, కొటికిపెంట ఏకలవ్య గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు మృతదేహాలను పట్టణంలో ఏరియా ఆస్పత్రి వద్ద రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డివిజి.శంకరరావుతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. మృతుల కుటుంబీకులను ఓదార్చారు. ఈ సందర్భంగా రాజన్నదొర స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ మృతదేహాలను వెంటనే వారి సొంత రాష్ట్రమైన హర్యానాకు తరలించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ తరలింపు మాకు సంబంధం లేదంటూ అధికార్లు తెలపడం దారుణమన్నారు. తక్షణమే విమానం వంటి వేగంగా వెళ్లే మార్గాల ద్వారా వారి సొంత రాష్ట్రమైన హర్యానాకు తరలించాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్, ఏకలవ్య డిప్యూటీ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీలతో రాజన్నదొర ఫోన్‌లైన్లో మాట్లాడారు. ఈ విషయమై చంద్రబాబు, మంత్రులు సంధ్యారాణి, లోకేష్ మానవత్వంతో స్పందించాలని కోరారు. కాగా తాను మృతుల కుటుంబాలకు కొంత ఆర్థిక సాయం చేయడానికి వెళ్లగా వారు సున్నితంగా తిరస్కరించడం వారి ఆత్మాభిమానానికి అద్దం పడుతుందని రాజన్నదొర పేర్కొన్నారు.

కదిలిన యంత్రాంగం

ఉపాధ్యాయుల మృతదేహాల తరలింపు విషయమై మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర వినతి మేరకు ప్రభుత్వ అధికార యంత్రాంగం కదిలింది. రాజన్నదొర వినతికి సంబంధించి సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో సీఎం చంద్రబాబు స్పందించి ఒకే విమానంలో మృతదేహాల తరలింపునకు ఆదేశాలు జారీ చేసినట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏరియా ఆస్పత్రికి శనివారం ఉదయమే వచ్చి మృతదేహాలను మంత్రి సంధ్యారాణి పరిశీలించారు. మంత్రి వెళ్లిన తరువాత వచ్చిన అధికారులు వీటి తరలింపు తమకు సంబంధం లేదని చెప్పడం, రాజన్నదొర వచ్చి మీడియాతో మాట్లాడడం అవి కాస్త వైరల్ కావడంతో ప్రభుత్వం స్పందించిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

బొండపల్లి: మండలంలోని కెరటాం గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 15న విశాఖపట్నంలో ఉంటున్న అన్నయ్యను చూసేందుకు వెళ్తానని తల్లికి చెప్పి గ్రామానికి చెందిన ఆటోలో బయలుదేరింది. అదే రోజు సాయంత్రం తల్లి తన కుమారుడికి ఫోన్ చేసి కుమార్తె గురించి తెలపగా తన వద్దకు రాలేదని చెప్పాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నవీన్ పడాల్

విజయనగరం క్రైమ్: మనస్తాపంతో యువకుడు సూసైడ్ నోట్ రాసి ఫ్యాన్‌హుక్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. బలిజిపేట మండలం తమరాడ గ్రామానికి చెందిన జి.చిన్నారావు (22) డీఎస్సీకి చదువుతున్నాడు. స్థానిక కొడువగంటి వారి వీధిలో మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి చదువుతున్నాడు. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో గదిలో ఎవరూ లేకపోవడం చూసి ఫ్యాన్ హుక్‌కి చున్నీతో ఉరి వేసుకుని చనిపోయాడు. మిగతా విద్యార్థులు గదికి వచ్చి చూసేసరికి విగతజీవిగా ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ నవీన్‌పడాల్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతుని వద్ద సూసైడ్ నోట్ లభించిందని, తనకు జాబ్ రాదని, ఎవరికీ ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదని, తన చావుకు ఎవరూ కారణం కాదని నోట్‌లో పేర్కొన్నాడన్నారు. మృతుని తండ్రి సోములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

• పోటీలను ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు



రాకెట్ పట్టి పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

విజయనగరం: రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళ, పురుషల షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న పోటీలను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, పూసపాటి అదితిగజపతిరాజులు ప్రారంభించారు. అనంతరం వారంతా క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ రాకెట్ పట్టి మైదానంలో ఆడారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. నిత్య సాధనతో ప్రతి క్రీడాకారుడు అనుకున్న లక్ష్యాన్ని చేధించాలని ఆకాంక్షించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించి మెన్స్ సింగిల్స్ విభాగంలో 48 మంది, డబుల్స్ విభాగంలో 24 మంది పోటీ పడుతుండగా... ఉమెన్ సింగిల్స్ విభాగంలో 40 మంది, డబుల్స్ విభాగంలో 17 మంది తలపడుతున్నారు. మిక్సిడ్ డబుల్స్ విభాగంలో 40 మంది క్రీడాకారులు పోటీ పడుతున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెల 8 నుంచి 11 వరకు రాజమండ్రిలో జరగనున్న ఆల్ ఇండియా సౌత్ జోన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు, 16 నుంచి 22 వరకు బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కెఎ.నాయుడు, చైర్మన్ ఇ.రఘురాజు, గౌరవ అధ్యక్షుడు ద్వారపురెడ్డి జగదీష్, కార్యదర్శి ఎస్.సురేష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్.ప్రసాద్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అవనాపు విజయ్, అసోసియేషన్ ప్రతినిధులు వై.కుసుంబచ్చన్, పాట్నూరు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విజయనగరం వేదికగా నిర్వహించతలపెట్టిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు శనివారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో నిర్వహించిన పోటీలను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధప్రాంతాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరుకాగా... మొదటి రోజు పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో సాగాయి. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తితో పోటీ పడి విజయావకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో ఆగ్రాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు కె.సుభాష్ చంద్రబోస్, కబడ్డీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.